
# ప్రేమపెన్నిధి

◆వసంతరావు రామకృష్ణారావు

ఆ రోజు మధ్యాహ్నం మా స్టాఫ్‌రూంలో లంచ్ తీసుకోవడానికి నా కేరియర్ విప్పుతున్నాను. నాతోటి కాలేజి లెక్చరర్లు, క్లాస్‌రూంలోని విషయాల గురించీ, రాజకీయ నాయకుల మాయాజాలం గురించీ, అనుదినం, అనుక్షణం ఎదురయ్యే అనేకానేక జీవన సమస్యల గురించీ, సినీమాల గురించీ – ఎవరికి తోచిన రీతిలో వారు సరదాగానో, చిరాకుగానో, పరాకుగానో, విసుగుదలతోనో చర్చించుకొంటున్నా, నాకు మాత్రం వాటివైపు దృష్టి వెళ్లలేదు. మనసు యాంత్రికంగా వున్నది. ఇంటర్వెల్ కాబట్టి ఆకలి తీర్చుకోవాలనే ప్రయత్నంలో వున్నాను.

"మాస్టారూ" – అన్న సన్నని కంఠస్వరం దగ్గరగా వినిపించడంతో తల ఎత్తి చూశాను – ఎదురుగా చేతిలో తెలుగు క్లాసు పుస్తకంతో నిలబడివుంది మంజరి. ఆమె నాజూకుగా వుండటమే కాకుండా, నడవడికలో, మాటతీరులో చాలా మర్యాద చూపుతుంది. మన్నన చూపుతుంది. నేను ఉపన్యాసం చేసేటప్పుడు, విద్యార్థుల ఆసక్తిని, వారి గ్రహణశక్తిని, అంచనా వేసుకోవడం నా అలవాటు – వారి ముఖాలను బట్టి, పాఠాలను వారు సరిగా అర్థంచేసుకుంటున్నదీ, లేనిదీ గమనిస్తూ వుంటాను. ఆ దృష్టితోనే మంజరి క్లాస్‌రూంలో ఏ విధంగా లెక్చర్లు వింటున్నది గమనించినవుడల్లా నాకు తృప్తిగా వుండేది.తన వద్ద వున్న నోట్సు పుస్తకంలో నేను చెప్పిన వాటిని పాయింట్స్‌గా వ్రాసుకుని, ఇంటి వద్ద నోట్సు తయారుచేసుకుని, మరునాడు నా వద్దకు తీసుకొనివచ్చి చూపుతూ వుండడంతో, తెలివైన విద్యార్థులలో మంజరి ఒకటి అని నాకు ఆ అమ్మాయి గురించి ఒక అభిప్రాయం ఏర్పడింది.



మంజరి "సార్! మీ లంచ్‌టైంలో మిమ్మల్ని అడుగుతున్నందుకు క్షమించండి" అన్నది. "ఏమిటీ విషయం" అని నేనుసానుభూతిగా అడిగేసరికి, మంజరి "మాస్టారూ! 'ప్రాంచద్భూషణ బాహుమూల రుచితో పాలిండ్లు పొంగార పై అంచుల్ మోవగ కౌగలించి' .... ఈ పద్యానికి దయచేసి ప్రతిపదార్థం చెప్పండి". అన్నది.

అసలు క్లాసులో కావాలి అనే నేను ఆ పద్యానికి ఏ విధమైన వివరణా ఇవ్వకుండా, దానిని వడిగా చదివి, మిగిలిన పద్యభాగాలకు వెళ్ళిపోయాను. పెద్దన మహాకవి వ్రాసిన ఇలాంటి శృంగార రసభరితమైన పద్యాలకు అర్థతాత్పర్యాలు కాలేజీ క్లాసు రూంలో మగపిల్లలూ, ఆడపిల్లలూ వుండేటప్పడు వానిని విడమర్చి చెప్పడం నావంటి లెక్చరర్లకూ, కొంతమందివిద్యార్థినీ విద్యార్థులకూ కాస్త ఇబ్బందిగా వుంటుంది. అందుచేతనే అలాంటివాటిని నెమ్మదిగా, నేర్పుగా దాటవేస్తూ వుండడం నాకు అలవాటు. ఒకరిద్దరు పెంకిఘటాలు లేచి అడగబోతే, వారిని తగువిధంగా మందలించడమూ నాకు అలవాటే!

ఆ కారణంచేతనే 'మంజరి' ఈ పద్య విషయంలో నా లంచ్ రూముకి వచ్చిందని నాకర్థమైంది.

కేరియర్‌ను చేతితో పట్టుకుని, నేను "అమ్మా! మంజరీ! ఆ పద్యంలో చెప్పబడిన విషయం నీవు

పెద్దదానవై వివాహం జరిగేక నీకు తెలుస్తుంది" అన్నాను చిరునవ్వు వులుముకుంటూ. నేనిచ్చిన ఈ జవాబు మంజరికి నచ్చలేదు - ఆమె నా వైపు నిరాశగానూ, శూన్యంగానూ చూస్తూ "థ్యాంక్స్" అని వెళ్లిపోయింది.

* * *

ఆ రాత్రి ఈ విషయం మా శ్రీమతితో ప్రస్తావనకు తెచ్చేను. కాలేజిలోనూ, దిన జీవితంలోనూ జరిగే ప్రతి విషయాన్ని శ్రీమతికి చెప్పడం నా అలవాటు. ఒక హాబీ కూడా. యాంత్రికమైన విషయాల పట్ల తను ఎలా రియాక్టు అయినా, ఇటువంటి రస భరితమైన సన్నివేశాలు, సంఘటనలు - వీనిపట్ల ఆమెకు చాలా ఆసక్తి వుంది. నేను వెలిబుచ్చే అభిప్రాయాలను తను ఒక్కోసారి ఆమోదిస్తుంది, అభినందిస్తుంది, ఆనందిస్తుంది. ఒక్కోసారి వాటిని నిష్కర్షగా, ఖండితంగా ఖండిస్తూ వుంటుంది. ఆ మండన, ఖండన సమయాలలో ఆమెలో ఏ విధమైన ఉద్వేగం వుండదు. అందుకే నేను సరదాపడతాను.

లంచ్ సమయంలో జరిగిన సంఘటనా, సంభాషణా శ్రీమతికి చెప్పేను. ఆమె ఎంత మాత్రం నా చర్యను సమర్థించలేదు. పైగా నా బోధనా సామర్థ్యాన్ని సవాలు చేస్తూన్నట్లుగా, "లెక్చరర్లు అయి వుండీ కూడా చదువుకునేవారికి పరీక్షల దృష్ట్యా అవసరమైనవి, ఆ విద్యార్థులు అడిగినపుడు చెప్పకుండా వుండడం బాగులేదు. నేనైతే చెపుతాను. కవి వ్రాసిన దానిని బోర్డు అధికారులు పాఠ్యంగా పెట్టారు. ఆ పాఠ్యాంశాన్ని చదువుకుని, పిల్లలు పరీక్షలు వ్రాయాలి. కాబట్టి లెక్చరరుగా మీరు మీ బాధ్యత నెరవేర్చలేదు" శ్రీమతితో నా చర్యను సమర్థించుకోవాలని ప్రయత్నించాను. ఎందుచేతనో వాదించడం నాకు ఇష్టం వుండదు. ఆమె వైపు భావగర్భితంగా చూసాను. ఆమె వదనంలో చిరుమందహాసం విరిసింది. తన పనుల మీద వెళ్లిపోయింది. నేను స్కూటర్ మీద కాలేజీకి వెళ్లేను.

* * *

ఆరాత్రి నాకు నిదుర రావడం లేదు. గతంలో జరిగినవి కనుల ముందు సినీమా రీలు మాదిరిగా కనుపిస్తున్నవి. మనసులో ఏదో తీయని హాయి, ఒక రకమైన ప్రశాంతమైన చిత్తస్థాయి. వీనితో మనసు ఉల్లాసంగా వుంది.

పది సంవత్సరాల క్రిందట సంగతి -

నా శ్రీమతి మాధురికీ, నాకూ మధ్య జరిగిన ప్రణయ సన్నివేశాలు, ప్రసాద మాధుర్యంతో కూడిన సంభాషణలూ, నర్మోక్తులూ క్రీగంటి చూపులూ, మందహాసమధురిమలూ, ప్రేమ గీతాలలోని సరిగమలూ - అన్నీ చోటుచేసుకున్న మరపురాని మధురమైన గడచిన కాలానికి వెళ్ళిన మనసు ఉబ్బితబ్బిబ్బు కావడం గమనించాను..

మంజరిలాగే మాధురి ఆరోజులలో నా వద్ద స్టూడెంటుగా వుండేది. చదువులో చలాకీతనం, కళ్లలో అమాయకత్వం, సహజమైన అందచందాలు, మాటలాడడంలో నేర్పు - ఇవి అన్నీ ఆమెలో నాకు ఆకర్షణీయంగా కనిపించిన అంశాలు. నా పేరు మాధవరావు. ఆమె మాధురి. మా ఇద్దరికీ భగవంతుడు కూర్చితే ఎంత బాగుంటుందని అనుకునేవాడిని. కాలేజీలో లెక్చరర్‌గా చేరిన కొత్తలో నేను కొత్తవాడిని కావడంతో నా స్టూడెంట్స్ ఆటపట్టించేవారు. అల్లరి కబుర్లు చెప్పేవారు. అయినా నేను నిబ్బరంగా వుండి, నా బోధనతో వాళ్లని క్రమంగా ఆకట్టుకోగలిగాను. అధ్యాపకులు అందరిలో సమర్థుడననిపించుకుని, ప్రిన్సిపాల్‌గారి మన్నన పొందాను.

ఆ రోజు కాలేజి అయిపోయింది. స్కూటరెక్కబోతున్నాను. మాధురి పరుగెత్తుకుంటూ "మాస్టారుగారూ! మీ ఇంటికి వస్తాను. కొన్ని పాఠాలు మీరు నాకు చెప్పాలి."ఈ "పాఠాలు" అనే మాట ఏ అర్థంలో వాడబడిందో ఆలోచిస్తూ, "సరే, రేపు ఉదయం తొమ్మిదింటికి రా" అన్నాను.

సరిగ్గా అదే సమయానికి మాధురి వచ్చింది. మా అమ్మ ఆ అమ్మాయిని పరీక్షగా చూస్తూ నన్ను పక్కగదిలోకి పిలిచి, "నీవు ఆడపిల్లలకు ప్రైవేట్లు చెప్పవద్దు. నాన్నగారు నీకు సంబంధం చూస్తున్నారు. ఒక్కగానొక్క కొడుకువి - నీకు సంప్రదాయంగల అమ్మాయినిచ్చి నీ పెండ్లి ఘనంగాచేస్తే, ఆ ముద్దూ ముచ్చటా చూడాలని మాకు వుంది. అమ్మ మాటలకు ఊకొట్టి "ప్రైవేటు కాదు" అన్నాను. అమ్మ మనసులో ఆందోళన తగ్గింది. ఆ రోజు కాస్త దూరంగా వుండి మాధురికి పాఠం బోధించాను. ఆ సమయంలో మాధురి కళ్ళల్లో చక్కదనాన్ని చూసి పరవశించేను. అమాయకత్వం నన్ను ఆకట్టుకున్నది. మాధురి కూడా ఏదో నేర్చుకోవాలనీ, ఎక్కువసేపు చదువు నిమిత్తంగా నా దగ్గర వుండాలనీ ఆశించేది. నేనూ అందుకు దోహదం చేస్తుండేవాడిని. అమ్మ మాత్రం అప్పుడప్పుడు మా ఇద్దరి మధ్యా జరిగే బోధన విని ఆనందించేది. అమ్మ దృష్టిలో నేను వాళ్ల నాన్నగారిలాగ పాఠాలు చెప్పగలనట. మా నాన్నగారు మాత్రం వాళ్ళ తండ్రిగారిలాగే ఇంగ్లీషు అనర్గళంగా మాట్లాడతాననీ, నా కంఠం కూడా వినేవారిని ఆకర్షిస్తుందనీ అందరితోనూ చెప్పి ఎంతగానో మురిసిపోయేవారు. అమ్మ కోసం తెలుగు ఎం.ఏ. చేశాను. నాన్నగారి తృప్తి కోరి ఇంగ్లీషు ఎం.ఏ. కూడా చేశాను. ఈ రెండు భాషలలోను నేను ప్రైవేట్లు చెప్పగలను. కానీ ఇంటి వద్ద విశ్రాంతిగా వుండడం మా అమ్మ అభిమతం కావడం చేత ప్రైవేట్లు చెప్పలేదు.

ఆ రోజు ఆదివారం - మాధురి నాతో "ప్రేమ పెన్నిధి" - అన్న గురజాడవారి గేయం గురించి వివరణ అడిగింది. ఇది వాళ్ల పాఠ్యభాగం కావడంచేత నేను బాగా ప్రిపేర్ అయి బోధించాను. ఆమెకు సంతృప్తి కలగలేదు. దానికి కారణం కవి చెప్పిన అభిప్రాయంతో తాను ఏకీభవించలేనన్నది. ఆమె తొలిసారిగా తనకు గల అభిప్రాయం ఇలా చెప్పింది. "ప్రేమ పెన్నిధి - కాని ఇంటను - నేర్వరీ కళ - ఒజ్జ లెవ్వరు లేరు - శాస్త్రిములిందు గూర్చి తాల్చె మౌనము - కవి ప్రేమను పెన్నిధిగా పేర్కొన్నారు. బాగున్నది. వారే దీనిని కళ అంటున్నారు. పైగా ఈ కళను ఒజ్జ లెవ్వరు నేర్వరు అన్నారు. నా ఉద్దేశంలో ప్రేమ హృదయ సంబంధమైనది. దీనిని కళగా పేర్కొనడం నాకు నచ్చలేదు. కళ దైవదత్తం. అలాగే ప్రేమ దైవదత్తమైనది. కాబట్టి ప్రేమను ఒజ్జలు (ఉపాధ్యాయులు) నేర్వరు అనడం అంత సముచితంగా లేదు"

ఆమె చెప్పిన దానితో ఏకీభవిస్తున్నట్టు తల ఊపి సూటిగా ఆమె కళ్లలోకి చూశాను. మా ఇద్దరి మధ్యా ఆదివరకు ఎన్నడూ లేని ఒక తీయని అలజడి, ఒక ఆత్మీయతగల అనుభవం, హృదయగతమైన వులకరింత - ఒక విధమైన తమకం - ఆనందం - ఉద్వేగం - ఇవి ఒకదాని వెంట ఒకటి జరిగినవి.

ఆ మర్నాడు సాయంత్రం అమ్మ నాతో ఇలా అన్నది: "మధూ! మాధురివాళ్ల తల్లిదండ్రులు వచ్చి వాళ్ళ అమ్మాయిని చేసుకోమంటున్నారు. వాళ్ళది మంచి కుటుంబం. దూరంగా వాళ్ళు బంధువులు కూడా. అమ్మాయికి నీవు "పాఠాలు" చెప్పినపుడు నేను గమనించాను. అందంగా వుంటుంది. రేపే పెళ్ళిచూపులు" - ఈ మాటలు నాకు ఆపాత మధురంగా వుండి అమ్మకు పాదాభివందనం చేశాను.

పెళ్ళిచూపులయ్యాయి - మా వివాహం జరిగింది. అమ్మా, నాన్నల ముద్దూముచ్చట్లు తీరాయి. మాధురి నా భార్య అయింది. ఆ రోజు శోభనం గదిలో చిరునవ్వుతో ఆమెను చేరదీస్తూ, నేను "మధూ! ప్రేమ పెన్నిధి, కానీ - నేను నీకు ఒజ్జను అయ్యాను" ఈ మాటలలో వున్న అర్థాన్ని గమనించి ఆనందంతో ఆమె నా ఒడిలో వాలిపోయి, ప్రేమపారవశ్యంతో నా వైపు చూస్తూ అలాగే వుండిపోయింది!